సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ద్వారకా బస్టేషన్‌లో మజ్జిగ పంపిణీ



మజ్జిగ చలివేంద్రం ప్రారంభిస్తున్న రమేష్‌చంద్ జైన్

దాబాగార్డెన్స్: ద్వారకా బస్టేషన్‌లో భారత్ వికాస్ పరిషత్ విశాఖ శాఖ, ఝాన్సీ లక్ష్మీబాయి మహిళా శాఖ సంయుక్తంగా ఆర్టీసీ ఉన్నతాధికారుల సహకారంతో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశాయి. వేసవి తీవ్రత దృష్ట్యా ప్లాట్‌ఫాం నంబర్ 1 వద్ద ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని భారత్ వికాస్ పరిషత్ జాతీయ స్థాయి ప్రతినిధి రమేష్‌చంద్ జైన్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేసవిలో ప్రయాణికులకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని, నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ ప్రతినిధులు పంపాన వేంకటేశ్వరరావు, ఎంవీ రాజశేఖర్, టీవీ నాగేశ్వరరావు, ఎం.సుధాకర్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: విశాఖ ఇలవేల్పు కనకమహాలక్ష్మి అమ్మవారికి మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనగోరే భక్తులు రూ.1,116 చెల్లించి పేరు నమోదు చేసుకోవచ్చు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. లేదా యూనియన్ బ్యాంక్ ఖాతా నంబర్ 060810011006681 (టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081)కు ఆన్‌లైన్‌లో చెల్లించి, పేరు, గోత్రం తెలియజేస్తే పూజ చేస్తారు. మరింత సమాచారం కోసం endow& eokanaka@gov. in కు మెయిల్ చేయవచ్చు.

వార్డుల్లో సమస్యలు పరిష్కరించండి



జీవీఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ సభ్యులు

అల్లిపురం: జీవీఎంసీ 7వ వార్డు మారం ఆంజనేయులునగర్‌లో రోడ్లు, కాలువలు బ్లాక్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ సభ్యులు కలెక్టర్ హరేందిర ప్రసాద్, జీవీఎంసీ ఇన్చార్జ్ కమిషనర్, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్‌కు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. మురుగునీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా 97వ వార్డు సుజాతనగర్ పరిధిలోని 150 కుటుంబాలకు జీవో నెం.30 ద్వారా ఇంటి పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ సభ్యులు కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లకు విజ్ఞప్తి చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సీపీఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు, పలువురు నాయకులు ఉన్నారు.

త్వరితగతిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారం



అర్జీ స్వీకరిస్తున్న జోన్-5 కమిషనర్ రాము

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఆరు అర్జీలు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ బోడ్డేపల్లి రాము స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. టౌన్ ప్లానింగ్‌కు 03, పబ్లిక్ హెల్త్‌కు 02, రెవెన్యూ విభాగానికి 01 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ తెలిపారు. ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి గైర్హాజరు, సమయపాలన పాటించని అధికారులపై ఆయన మండిపడ్డారు. రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఏఈ ఉషారాణి, ఏపీడీవోలు కృపానందం, పుణ్యవతి, టౌన్ ప్లానింగ్ సర్వేయర్ లీలావతి, మంచినీటి విభాగం ఏఈ సుమన్ తదితరులు పాల్గొన్నారు.







మందుబాబులకు అడ్డాగా లక్ష్మీటాకీస్ పార్క్

ఆటపరికరాలకు తుప్పు

మచ్చుకైనా కనిపించని ఆహ్లాదం

పట్టించుకోని అధికారులు

మిథ్యానవనాలు

నాడు కళకళ.. నేడు వెలవెల

దాబాగార్డెన్స్: దాదాపు రెండు లక్షల జనాభా ఉన్న దక్షిణ నియోజకవర్గంలోని పార్కులు నేడు కళ తప్పాయి. గత ప్రభుత్వంలో అభివృద్ధి చెందిన ఉద్యానవనాలు ప్రస్తుతం నిస్సారంగా దర్శనమిస్తున్నాయి. నగరాభివృద్ధిలో కీలక పాత్ర పోషించే పార్కులను కూటమి ప్రభుత్వం గాలికొదిలేయడంతో అవి అభివృద్ధికి నోచుకోవడం లేదు.లక్ష్మీటాకీస్ పార్క్ పరిస్థితి మరింత దయనీయంగా మారింది. పిల్లలు ఆడుకునే క్రీడా పరికరాలు మూలకు చేరాయి. జారుడు బల్లలు, తోపుడు బల్లలు, ఊయలలు నిరుపయోగంగా పడి ఉన్నాయి. పచ్చదనంతో కళకళలాడాల్సిన ఈ పార్కులో రాళ్లు, మట్టి, బొగ్గు దర్శనమిస్తున్నాయి. రాత్రివేళల్లో ఈ ప్రాంతం మందుబాబులకు అడ్డాగా మారుతోంది. ఆహ్లాదం మచ్చుకైనా కనిపించని ఈ పార్కులు అసౌకర్యాలకు, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతున్నాయి. అడిగే నాథుడే కరువవ్వడంతో పార్కుల కళ తప్పుతోంది.

మూలకు చేరిన ఆట పరికరాలు

ఆర్కే బీచ్ సమీపంలోని వరుణ్ పార్క్ గతంలో పిల్లల ఆటలతో కళకళలాడేది. ఆరు నెలల క్రితం వరకు ఇక్కడ జారుడు బల్లలు, ఊయలలు, రంగుల రాట్నం వంటి అనేక ఆట పరికరాలు ఉండేవి. ప్రతి సాయంత్రం, వారాంతాల్లో ఎంతో మంది పిల్లలు ఇక్కడ ఆడుకునేవారు. అయితే, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పార్కుల అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయింది. పిల్లలు ఆడుకునే క్రీడా పరికరాలు ఒక్కొక్కటిగా శిథిలమవుతున్నా పట్టించుకునేవారు లేరు. ప్రస్తుతం వరుణ్ పార్క్‌లోని ఆట పరికరాలు పనికిరాకుండా మూలకు చేరాయి. రంగుల రాట్నం అయితే పూర్తిగా కనిపించకుండా పోయింది. ఊయలలు నిర్జీవంగా ఊగుతున్నాయి. ఇక ఉన్న ఒకే ఒక్క జారుడు బల్ల ప్రమాదకరంగా మారింది. దాని మెట్లు తుప్పు పట్టి విరిగిపోయాయి. జారుడు బల్లపై జారే చోట పెద్ద కన్నం ఏర్పడటంతో పిల్లల కాళ్లు అందులో ఇరుక్కుని ప్రమాదాలకు గురవుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని బీచ్‌కు వచ్చే పర్యాటకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలు సంతోషంగా ఆడుకునేందుకు ఉద్దేశించిన ఈ పార్కు నేడు వారికి ప్రమాదకరంగా మారడం బాధాకరం.

పార్కులను పట్టించుకోని ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు 11 నెలలు కావస్తోంది. ఇప్పటి వరకు ఒక్కటంటే ఒక్క పార్కు కూడా అభివృద్ధి చేసిన పాపాన పోలేదు. గత ప్రభుత్వం చేసిన అభివృద్ధే ఇంత వరకూ ఉంది. ప్రస్తుతం పిల్లలకు వేసవి సెలవులు వచ్చాయి. ఆడుకునేందుకు ఆట పరికరాలు లేకపోవడంతో చిన్నారులు అసంతృప్తికి గురవుతున్నారు.



జారుడు బల్ల ఎక్కే మెట్ల మార్గం తుప్పుపట్టి.. విరిగి ప్రమాదాలకు నిలయంగా ఉన్న దృశ్యం



వరుణ్‌బీచ్ పార్క్‌లో చిన్న పిల్లలు ఆడుకునే ఊయల పరిస్థితి ఇదీ..



జారుడుబల్ల జారిన దిగువ భాగంలో ప్రమాదకరంగా ఉన్న దృశ్యం



ఇక్కడ ఉండే రంగుల రాట్నం ఎక్కడ?

రేణుక యల్లమ్మ ఆలయంలో అన్నసమారాధన



అన్నసమారాధనలో పాల్గొన్న రేణుక యల్లమ్మ అమ్మవారి ఆలయ కమిటీ ప్రతినిధులు

అల్లిపురం: కెప్టెన్ రామారావు జంక్షన్‌లోని రేణుక యల్లమ్మ అమ్మవారి ఆలయంలో సోమవారం అన్న సమారాధన కార్యక్రమం ఘనంగా జరిగింది. దాత వంకాయల ప్రభాకర్ తన కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, కార్యదర్శి బొడ్డు పోలరావు, కోశాధికారి సత్యనారాయణ, కమిటీ సభ్యులు, సలహాదారు బొడ్డేటి అచ్చుత ప్రసాద్ పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు దాత వంకాయల ప్రభాకర్‌ను అమ్మవారి శేష వస్త్రంతో సత్కరించారు. ఆలయ అర్చకులు కామేశ్వరశర్మ వారికి వేదాశీర్వచనాలు పలికి, అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి



కోటవీధి వద్ద యూజీడీ మ్యాన్‌హోల్‌ను పరిశీలిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: వార్డుల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జోన్-4 జెడ్సీ ఎం. మల్లయ్యనాయుడు సూచించారు. సోమవారం ఆయన 35వ వార్డులోని కోటవీధి, పాత పోస్టాఫీసు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీధులు, రహదారులు, చిన్న కాలువలను శుభ్రంగా ఉంచాలని పారిశుద్ధ్య కార్మికులకు సూచించారు. మురుగు సాఫీగా వెళ్లేలా చెత్తను తొలగించాలని, నిషేధిత ప్లాస్టిక్ కవర్ల వాడకంపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్ఓ కృష్ణంరాజు, శానిటరీ సూపర్‌వైజర్ కిషోర్, ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు కంప్యూటర్‌పై అవగాహన



పిల్లలకు కంప్యూటర్‌పై అవగాహన కల్పిస్తున్న రీసోర్స్ పర్సన్ అరుణకుమారి



పిల్లలకు బాల్ పాసింగ్ గేమ్ ఆడిస్తున్న గ్రంథాలయ అధికారి పోలితల్లి

దాబాగార్డెన్స్: వేసవి శిక్షణా శిబిరాల్లో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయం మరియు జీవీఎంసీ 36వ వార్డు పరిధిలోని బాలల శాఖ గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.జిల్లా కేంద్ర గ్రంథాలయంలో రీసోర్స్ పర్సన్ కె. అరుణకుమారి విద్యార్థులకు కంప్యూటర్ ప్రాథమిక అంశాలపై అవగాహన కల్పించారు. కంప్యూటర్ అంటే ఏమిటి, సీపీయూ, ర్యామ్, రామ్ వంటి భాగాల గురించి వివరించారు. అనంతరం విద్యార్థులు కథల పుస్తకాలు చదివారు. గ్రంథాలయ అధికారి రాజేంద్ర వర్మ పిల్లలకు బిస్కెట్లు, చాక్లెట్లు, మజ్జిగ పంపిణీ చేశారు. అలాగే జీవీఎంసీ 36వ వార్డు పరిధి రంగిరీజువీధి బాలల శాఖ గ్రంథాలయంలో సోమవారం చందమామ కథలు చెప్పారు. రీసోర్స్ పర్సన్ ఎం చిట్టి నారాయణమ్మ పాల్గొని పిల్లలకు కథలు బోధించారు. గ్రంథాలయ అధికారి పోలితల్లి పిల్లలకు బాల్ పాసింగ్ గేమ్ ఆడించారు. కార్యక్రమంలో 35 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం పిల్లలకు ఫ్రూట్స్ అందజేశారు.

'అంతర్జాతీయ తెలుగు మహా సంబరాలు' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మేయర్ పీలా

దాబాగార్డెన్స్: శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమాండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ కొల్లి రామవతి ఆధ్వర్యంలో ఈ నెల 10, 11 తేదీల్లో ఏలూరులో జరగనున్న అంతర్జాతీయ తెలుగు మహా సంబరాల పోస్టర్‌ను సోమవారం నగర మేయర్ పీలా శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ పీలా శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగు భాషను కాపాడుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అవసరమన్నారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ ఒక కళా సంస్థ ఇంత పెద్ద ఎత్తున తెలుగు సంబరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విశాఖ నుంచి కవులు, రచయితలు ఈ సభకు తరలిరావాలని కళావేదిక గౌరవ అధ్యక్షుడు సత్తివాడ శ్రీకాంత్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళావేదిక కార్యదర్శి సత్యాడ నర్సింగరావు, రత్నం రామ్‌గోపాల్, ఇమంది నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

జీవవైవిధ్య పరిరక్షణ అందరి బాధ్యత



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న గ్రీన్ క్లైమేట్ టీమ్

ఎంవీపీకాలనీ: జీవవైవిధ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని గ్రీన్ క్లైమేట్ టీమ్ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం అన్నారు. ఎంవీపీ కాలనీ సెక్టార్-12 ఉషోదయ కూడలి వద్ద సోమవారం పర్యావరణ పరిరక్షణ మాసోత్సవం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే నెలలో ప్రతి ఒక్కరూ దేశీయ పండ్ల విత్తనాలను సేకరించాలని సూచించారు. వాటితో విత్తన బంతులు తయారీ చేసి సామాజిక వనాలు పెంచేందుకు కృషి చేయాలని కోరారు. తద్వారా భూమి మీదున్న జీవరాశి, ప్రకృతిని కాపాడుకోవడంలో అందరూ బాధ్యులు కావాలన్నారు. అనంతరం విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులతో కలిసి పర్యావరణ దినోత్సవ క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చిత్రకారిణి పూర్వీ రజాక్, ఉపాధ్యాయులు పి.రాధాకృష్ణ, గ్రీన్ వలంటీర్లు రాజేశ్వరి, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వ్యక్తి మృతి



ఆటోలో వెల్లకిలా పడి మృతి చెందిన వ్యక్తి

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి మద్యం మత్తులో మృతి చెందాడు. లా అండ్ ఆర్డర్ ఎస్ఐ కృష్ణ తెలిపిన వివరాలిలా.. 11వ వార్డు గాంధీనగర్‌కు చెందిన స్వామి(40) అవివాహితుడు. అతడు మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి పూటుగా మద్యం తాగాడు. రాత్రి ఇంటికి చేరలేదు. సోమవారం తెల్లవారేసరికి అదే వార్డు వికలాంగుల కాలనీలోని ఓ ఆటోలో వెల్ పడి మృతి చెందాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఆటోలో కూర్చొని పూటుగా తాగిన మైకంలో అదే ఆటోలో వెల్లకిలా పడిపోయాడు. ముఖం కిందకు ఉండటంతో ఊపిరి ఆడక మృతి చెందినట్లు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణ తెలిపారు.

కేజీహెచ్‌లో అపరిశుభ్ర వాతావరణం

మహారాణిపేట: కేజీహెచ్‌లోని పలు వార్డుల్లో అపరిశుభ్ర వాతావరణ పరిస్థితులపై డీవైఎఫ్ఐ నాయకులు సోమవారం ఆందోళన తెలిపారు. ఆస్పత్రిలో ఎక్కడ చూసినా అపరిశుభ్రత తాండవిస్తోందని, బహిరంగ మలవిసర్జనతో ఆస్పత్రి ఆవరణ దారుణంగా ఉందని ఆక్షేపించారు. మరుగుదొడ్ల పరిస్థితి దయనీయంగా ఉందని డీవైఎఫ్ఐ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. శానిటేషన్‌కు సంబంధించి 275 మంది ఉండాలని, కానీ తక్కువ మందితో పనులు చేయిస్తుండటం వల్లే ఈ పరిస్థితి నెలకొందన్నారు. కాంట్రాక్టర్ తీరుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. కొంతమంది కార్మికుల్ని 12 గంటలు పని చేయాల్సిందిగా ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. దీనిపై కేజీహెచ్ సూపరింటెండెంట్ చర్యలు తీసుకోవాలని కోరారు.

ముగిసిన 'క్షమత' టీచర్ శిక్షణ

బీచ్‌రోడ్డు: కోటక్ మహీంద్రా ఆధ్వర్యంలో రాష్ట్రంలో కోటక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ 'క్షమత' టీచర్ శిక్షణ కార్యక్రమం ప్రారంభమైందని ఫౌండేషన్ సీఈవో డాక్టర్ గణేశ్ రాజా తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో మూడో రోజుల పాటు నిర్వహించిన క్షమత టీచర్ శిక్షణ సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు, పాఠశాల నాయకుల కోసం క్షమత వన్ కేఈఎఫ్ యాప్‌ను ఆండ్రాయిడ్ ఫోన్లలో ఆవిష్కరించామన్నారు. ఏపీలోని 186 సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ పాఠశాలలు, 108 మహాత్మా జ్యోతి బాపూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ పాఠశాలల్లో క్షమత డిజిటల్ విద్య అమలులోకి వస్తోందన్నారు.

పీజీఆర్ఎస్‌తో సమస్యలకు సత్వర పరిష్కారం



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: సమస్యల పరిష్కారానికి ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని జీవీఎంసీ జోన్-4 జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు సూచించారు. సోమారం జోన్-4 కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి యూసీడీ నుంచి 1, రెవెన్యూ నుంచి 2, టౌన్‌ప్లానింగ్ నుంచి 1 అర్జీని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీవెన్స్ సెల్‌కు వచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను సూచించారు. సమస్యలపై వచ్చిన ప్రజలను కార్యాలయాల చుట్టూ పదేపదే తిప్పించరాదన్నారు. సమస్య పరిష్కారం తర్వాత ఫోన్ ద్వారా అర్జీదారుతో మాట్లాడి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు, ఇంజినీరింగ్ అధికారి నర్సింహారావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఝాన్సీ, యూజీడీ, ఎలక్ట్రికల్ ఏఈలు తాగునీటి విభాగం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయానికి భూమి కేటాయింపుపై నిరసన



స్ప్రింగ్‌రోడ్డు వద్ద నిసరన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

జగదాంబ: పేదలకు ఇళ్లు కేటాయించకుండా టీడీపీ కార్యాలయానికి భూమి కేటాయించడాన్ని సీఐటీయూ తీవ్రంగా వ్యతిరేకించింది. సోమవారం జీవీఎంసీ 35వ వార్డు స్ప్రింగ్ రోడ్డులో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సుబ్బారావు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ, టీడీపీ ప్రభుత్వం బడా పెట్టుబడిదారులకు, టాటా, ఊర్జా వంటి కంపెనీలకు ఎకరాకు కేవలం రూ. 99 పైసలకే భూమి కట్టబెట్టడాన్ని ఖండిస్తున్నామన్నారు. పేద ప్రజలను ప్రభుత్వం పట్టించుకోకుండా వ్యవహరిస్తున్న తీరు దుర్మార్గమని ఆయన విమర్శించారు. బడా కంపెనీలకు కట్టబెట్టిన భూములు వెనక్కి తీసుకోవాలని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పేదలకు ఇళ్లు, స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వై. రాజు, చంద్రశేఖర్, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌కు మొర



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దళిత ప్రజా సంఘాల నాయకులు

మహారాణిపేట: చినముషిడివాడ ఆక్సిజన్ డిఫెన్స్ కాలనీలో అంబేడ్కర్ విగ్రహం తొలగించడం తగదని ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో విశాఖ జిల్లా కలెక్టర్‌కు దళిత ప్రజా సంఘాల నాయకులు సోమవారం ఫిర్యాదు చేశారు. రాజేష్ అనే వ్యక్తి కబ్జాలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకుని, దాన్ని అందరికీ ఉపయోగపడేలా మినీ పార్కుగా మార్చి, మిగిలిన స్థలంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్, ఓపెన్ స్పేస్‌గా ఉంచి, మినీ పార్క్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు దళిత సంఘాల నాయకులు తెలిపారు. కలెక్టర్‌ను కలిసినవారిలో భీమ్ సేన వార్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వసంత రాజేంద్రప్రసాద్, పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, ఇప్టు రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, వివిధ సంఘాల ప్రతినిధులు ఉన్నారు.

ఇళ్ల పట్టాల మంజూరుకు వినతి

చినముషిడి వాడ రెవెన్యూ పరిధిలో పదేళ్లుగా నివసిస్తున్న 150 మంది కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.30 ద్వారా ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా నాయకులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందించారు. సీపీఐ నాయకులు ఎం .పైడిరాజు, ఆర్ శ్రీనివాసరావు, వై.రాంబాబు, ఎ.అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

ఏయూను సందర్శించిన సమాచార హక్కు కమిషనర్



ఏయూ రిజిస్ట్రార్‌కు పుస్తకాన్ని బహూకరిస్తున్న కమిషనర్ శామ్యూల్

విశాఖ విద్య: రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్ శామ్యూల్ జోనాథన్ సోమవారం ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్‌కు 'గుంటూరు-త్రూ ద ఏజెస్' అనే ప్రత్యేక పుస్తకాన్ని కమిషనర్ బహూకరించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల జరుగుతున్న సందర్భంగా ఇదే తరహా పుస్తకాన్ని తయారు చేయడానికి ఆయన ఆసక్తి వ్యక్తం చేశారు. ఏయూ వీసీ రాజశేఖర్ దృష్టికి దీన్ని తీసుకెళ్లి అనుమతి తెలియజేస్తామని రిజిస్ట్రార్ అన్నారు.